క్లుప్తంగా...

సమస్యలపై అధికారులు స్పందించాలి



జలమండలి అధికారులతో చర్చిస్తున్న హేమ

సికింద్రాబాద్: డివిజన్ పరిధిలో పెండింగ్ పనులను ప్రజలకు ఇబ్బందులు లేకుండా త్వరగా చేపట్టాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. శ్రీనివాసనగర్‌లోని జలమండలి కార్యాలయంలో బుధవారం ఆమె జలమండలి అభివృద్ధి పనులు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా లో ప్రెషర్, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో వంటి ఫిర్యాదులపై అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జలమండలి డీజీఎం కృష్ణ, మేనేజర్ నవ్య తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టే వృత్తిదారులకే చైర్మన్ పదవి ఇవ్వాలి

కవాడిగూడ: చేపలు పట్టే నిజమైన వృత్తిదారులకే మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ పదవి ఇవ్వాలని భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు కే.ఎం శంకర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు చేపలు పట్టే నిజమైన గంగపుత్రులకే చైర్మన్ పదవి ఇవ్వాలని కోరుతూ.. భోలక్‌పూర్ డివిజన్‌లోని భోలక్‌పూర్ హౌజ్ వద్ద డివిజన్ సంఘం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. సంఘం అధ్యక్షుడు శంకర్ మాట్లాడుతూ.. నిజమైన చేపలు పట్టే వృత్తిదారులైన గంగపుత్రులకే చైర్మన్ పదవిని ఇచ్చి న్యాయం చేయాలన్నారు. ముదిరాజ్‌లకు వైఎస్ చైర్మన్ పదవి లేదా ఇతర పదవులను ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై సీఎం కేసీఆర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామన్నారు. గంగపుత్ర సంఘం సలహాదారులు గోపాల్, శంకర్, సంఘం ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రావు, ఉపాధ్యక్షుడు అనీష్, మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, కె.స్వరూప, శివరాణి, సంఘం బిల్డింగ్ అధ్యక్షుడు కే.ఎం సాయి, నాగేందర్, కవిత తదితరులు పాల్గొన్నారు.

బీసీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించాలి

కాచిగూడ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ పారిశ్రామిక విధానాన్ని ప్రకటించాలని తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశ జనాభాలో 54 శాతం ఉన్న బీసీలు పారిశ్రామికరంగంలో 10 శాతానికి మించి లేరన్నారు. పారిశ్రామిక రంగంలో బీసీలకు రాయితీలను ఇచ్చి ప్రోత్సహించాలని కోరారు. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు, పారిశ్రామికీకరణతో ప్రైవేట్ రంగంలో పెద్ద ఎత్తున పరిశ్రమలు రావడం వలన బీసీ చేతివృత్తులు దెబ్బతిని లక్షలాది మంది ఉపాధిని కోల్పోయారన్నారు. బీసీలు పారిశ్రామిక రంగంలో రాణించేలా ఉపాధిని కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేరం శివనాగేశ్వర్ రావు, ముత్యాల్‌రావు, డాక్టర్ ప్రశాంత్‌నిమ్‌కర్, కిషోర్, కృష్ణ, భూషణ్ భాస్కర్ తదితరులున్నారు.

ముగిసిన ఉచిత కాలిగ్రఫీ శిక్షణా తరగతులు

కాచిగూడ: జీవీఆర్ కరాటే అకాడమీలో 15 రోజుల పాటు నిర్వహించిన ఉచిత కాలిగ్రఫీ శిక్షణ తరగతులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా బుధవారం కాచిగూడ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ రిఫరీ బోర్డు చైర్మన్ వేమూరి తాండవ కృష్ణ పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఇలాంటి కార్యక్రమాలు పిల్లల భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడతాయన్నారు. కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, హైకోర్టు అడ్వకేట్ ఎన్.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయండి

కాచిగూడ: కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పిలుపునిచ్చారు. బుధవారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. యోగా ప్రాముఖ్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

నేడు తనికెళ్ల భరణికి సత్కారం

చిక్కడపల్లి: ప్రముఖ నటుడు ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకుని ఈనెల 25న త్యాగరాయగానసభ ప్రధాన వేదికపై నటదర్శక రచయిత తనికెళ్ల భరణికి ఎన్టీఆర్ పురస్కారం బహూకరిస్తున్నట్లు శారద మ్యూజిక్ అకాడమీ అధ్యక్షులు శారద ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్య అతిథిగా సీబీఐ విశ్రాంత అధికారి లక్ష్మీనారాయణ పాల్గొననున్నట్లు సమాచారం. వంశీ రామారాజు నిర్వహణలో జరిగే ఈ కార్యక్రమంలో చింతలపూడి త్రినాథరావు, కె.శ్రీధర్, ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొననున్నారు.

ఆస్పత్రి నిర్మిస్తారా.. ఎన్నికలను బహిష్కరించమంటారా!

- ఆస్పత్రి ఏర్పాటుకు కోసం 51 రోజులకు చేరిన రిలే నిరాహార దీక్ష
- స్పందించని ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు
- ఎన్నికల బహిష్కరణకు సిద్ధమంటున్న బస్తీవాసులు



51వ రోజు రిలే దీక్షను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్

లాలాపేట: తమ బస్తీలో ఆస్పత్రి నిర్మించాలని బస్తీవాసులంతా ఏకమై రిలే నిరాహార దీక్షకు శ్రీకారం చుట్టారు. దీక్ష ప్రారంభమైన 51 రోజులకు చేరినా ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వం స్పందించకపోవడంపై మాణికేశ్వర్‌నగర్ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్య పరిష్కారం కాకుంటే వచ్చే ఎన్నికల్లో బస్తీ వాసులందరూ ఓటు హక్కును వినియోగించుకోమని హెచ్చరిస్తున్నారు. హాస్పిటల్ ఏర్పాటుకు అంగీకారం తెలుపకుండా ఎవరూ తమ బస్తీలో ఓటు కోసం రావద్దని తెలుపుతూ మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద ఓ ఫ్లెక్సీ బోర్డును ఏర్పాటు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు.

కేంద్ర మంత్రికి సైతం వినతి..

నగరం నడిబొడ్డున చరిత్రాత్మక ఉస్మానియా యూనివర్సిటీ పక్కనే ఏళ్ల తరబడి దాదాపు 30 వేల జనాభా ఉన్న వడ్డెర బస్తీలో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో లేక నానా అవస్థలు పడుతున్నారు. ఏదైనా అనారోగ్యం వస్తే దూర ప్రాంతాలకు వెళ్లాల్సి దుస్థితి. సుదీర్ఘకాలంగా దాదాపుగా 20 ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న సమస్య ఇది. కనీస సౌకర్యం వైద్య సేవలు అందించడానికి హాస్పిటల్ ఏర్పాటు చేయాలంటూ ఓయూ మాణికేశ్వర్‌నగర్(వడ్డెరబస్తీ)వాసులు మొర పెట్టుకుంటున్నారు. దీనిపై ఇప్పటికే స్థానిక ప్రజా ప్రతినిధుల నుంచి కేంద్ర మంత్రుల వరకు వినతి పత్రాలు అందజేశారు. చేయి చేయి కలుపుదాం భవిష్యత్ తరానికి హాస్పిటల్ నిర్మాణం చేద్దామంటూ ఏప్రిల్ 5న మాణికేశ్వర్‌నగర్ కమాన్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షకు వివిధ రాజకీయ పార్టీలు, సంస్థలు సంఘీభావం తెలుపుతూ మద్దతు ప్రకటిస్తున్నారు.

ప్రజా ప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తాం..



తమ న్యాయమైన డిమాండ్ సాధనకు రిలే దీక్షలతో నిరసన తెలుపుతున్నాం. బాధ్యత గల స్థానిక ప్రజా ప్రతినిధులు స్పందించకపోవడం బాధాకరం. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ స్పందించి బస్తీ వాసుల సమస్యను పరిష్కరించాలి లేకుంటే తమ ఉద్యమాన్ని ఉద్ధృతం చేసే క్రమంలో ఎమ్మెల్యే, ఎంపీ ఇళ్లను సైతం ముట్టడిస్తాం. – వరికుప్పల శ్రీనివాస్

మొండి వైఖరిని విడనాడాలి ..



ప్రజల ఓట్లతో గెలిచి గద్దెనెక్కిన ఎమ్మెల్యే, ఎంపీలు తమ నియోజకవర్గంలోని ప్రజలు హాస్పిటల్ కోసం గత కొన్ని రోజుల నుంచి నిరసన చేస్తున్నా స్పందించకపోవడం బాధాకరం. వచ్చే ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని మాణికేశ్వర్‌నగర్ వాసుల ఓట్ల కోసం వస్తారు. స్థానిక ప్రజా ప్రతినిధులు మొండి వైఖరి వీడి దీక్షా శిబిరానికి వచ్చి కచ్చితమైన హామీ ఇవ్వాలి. –గండికోట విజయ్‌కుమార్, బస్తీ నాయకులు

కాలేజీ నూతన భవనాల నిర్మాణానికి చర్యలు



బోర్‌వెల్ పనులను పరిశీలిస్తున్న గాదరి కిషోర్,పద్మారావు గౌడ్

డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్

సికింద్రాబాద్: సీతాఫల్‌మండిలో కొత్తగా రూ. 30 కోట్లతో నిర్మాణం చేస్తున్న ప్రభుత్వ పాఠశాల, కాలేజీ భవనాల నిర్మాణం, రూ 13 కోట్లతో నిర్మించనున్న కుట్టివెల్లోడి ప్రభుత్వ హాస్పిటల్ నిర్మాణం పనులను బుధవారం డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సందర్శించి పనులను సమీక్షించారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని సందర్శించగా కార్యాలయ కార్యకలాపాలు, సెట్విన్ సంస్థ పనితీరును పద్మారావు గౌడ్ వివరించారు. సికింద్రాబాద్‌లో వివిధ అభివృద్ధి కార్యకలాపాలు సాగుతున్న తీరు ఆదర్శవంతంగా నిలుస్తుందని ఈ సందర్భంగా గాదరి కిషోర్ ప్రశంసించారు. అనంతరం పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. విద్యా రంగంలో చేయూతనిస్తూ రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా జూనియర్, డిగ్రీ కళాశాల సీతాఫల్‌మండి ప్రభుత్వ స్కూల్లో మంజూరు చేయించామని వీటి భవనాల నిర్మాణానికి రూ. 30 కోట్ల మేరకు నిధులను మంజూరు చేయించామన్నారు. నగరంలో ఆదర్శంగా నిలిచేలా సెట్విన్ శిక్షణ కేంద్రాన్ని సీతాఫల్‌మండిలో ఏర్పాటు చేశామన్నారు. కొత్త భవనాల నిర్మాణ పనులు సాధ్యమైనంత తొందరగా ప్రారంభించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, నాయకులు లింగాని శ్రీనివాస్, కరాటే రాజు, కంది నారాయణ పాల్గొన్నారు.

పెండింగ్ పనుల పూర్తికి సహకరించండి

కంటోన్మెంట్ సీఈఓ, జలమండలి ఎండీకు వినతి

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న హయాంలో చేపట్టిన పనులన్నీ నిరంతరంగా కొనసాగేలా చూడటమే లక్ష్యమని ఆయన కుమార్తె మాజీ కార్పొరేటర్ లాస్య నందిత అన్నారు. బుధవారం కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్, జలమండలి ఎండీ దాన కిశోర్‌ను వేర్వేరుగా కలిసి పెండింగ్‌లో పనుల పూర్తికి సహకరించాలని వినతి పత్రం అందజేశారు. తొలుత సీఈఓను కలిసిన ఆమె కంటోన్మెంట్ బోర్డు పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మడ్‌ఫోర్ట్ అంబేద్కర్ హట్స్‌లో తాగునీటి పైపులైన్ కోసం దివంగత ఎమ్మెల్యే నిధులు కేటాయించిన విషయాన్ని గుర్తుచేస్తూ తక్షణమే పనులు చేపట్టాలని విన్నవించారు. పికెట్ రామ్‌నగర్‌లో అసంపూర్తి నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాలు పనులు పూర్తి చేసేందుకు వర్క్ ఆర్డర్ విడుదల చేయాలని ఏడో వార్డు గాంధీనగర్‌లో బస్తీ దవాఖానాకు భవనం కేటాయింపుతో పాటు బస్తీలో నూతన బోర్‌వెల్‌కు పంప్‌సెట్‌కు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సీఈఓ మధుకర్ నాయక్‌ను కలిసిన లాస్య నందిత

మోండాలో రూ.2 కోట్ల పెండింగ్ పనులు

నియోజకవర్గం పరిధిలోని మోండా డివిజన్ పరిధిలో రూ.2 కోట్ల మేరకు పెండింగ్ పనులకు సత్వరమే నిధులు విడుదల చేయాలని లాస్య నందిత జలమండలి ఎండీ దానకిశోర్‌ను కోరారు. టీచర్స్ కాలనీలో రూ.37 లక్షలు, రెజిమెంటల్ బజార్‌లో రూ.34 లక్షలు, రూ.19.25 లక్షలతో మారేడుపల్లి గ్రేవీ యార్డు వద్ద చేపట్టిన డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో పనస సంతోష్, సదానంద్ గౌడ్, భాస్కర్ ముదిరాజ్, తేజ్‌పాల్, మురళీ యాదవ్, మల్లేశ్ పాల్గొన్నారు.

తవ్వి వదిలేశారిలా.. నడిచేదెలా?

తార్నాక డివిజన్ ఆర్యనగర్‌లో ఇటీవల నూతనంగా చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం కోసం బస్తీలోని రోడ్లన్నీ తవ్వారు. రోజులు గడుస్తున్నా తవ్విన శిథిలాలను తొలగించలేదు..నూతన సీసీ రోడ్డు నిర్మాణం చేయలేదు. దీంతో ఆర్యనగర్ వాసులు ఇంట్లో నుంచి బయట కాలు పెట్టలేని పరిస్థితి ఉందన్నారు. వృద్ధులు, పిల్లలు, వాహనాలు రాకపోకలు సాగించడానికి తీవ్ర ఇబ్బందిగా మారింది. దీనిపై ఇంజనీరింగ్ అధికారులకు ఫిర్యాదు చేస్తే సదరు కాంట్రాక్టర్ తమ మాటను సైతం వినే స్థితిలో లేరని చెబుతుండటం విడ్డూరం. ఏదేమైనా రోడ్డు తవ్వి వదిలేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆర్యనగర్ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–లాలాపేట



వడ్డెర భవన నిర్మాణ పనులపై మంత్రితో చర్చ

రహమత్‌నగర్: వడ్డెర భవన నిర్మాణ పనులపై వడ్డెర ఆత్మగౌరవ భవన సముదాయం ట్రస్ట్ చైర్మన్ జి.సత్యనారాయణ రాజు సభ్యులతో కలిసి బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌తో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వడ్డెర భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ ఒక ఎకరం స్థలం కేటాయించడం అభినందనీయమన్నారు. పనులను వెంటనే ప్రారంభించాలని ఆయన మంత్రిని కోరారు. ప్రభుత్వం కులవృత్తులకు అందించబోయే రూ. లక్ష ఆర్థిక సాయాన్ని వడ్డెర కులస్తులకు సైతం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం భవనం నమూనాను మంత్రి కమలాకర్‌కు సమర్పించారు. ట్రస్ట్ ప్రతినిధులు ఓర్సు కృష్ణయ్య, ఎత్తరి అంతయ్య, గంజ సాయికృష్ణ, బండారి శ్రీరాములు, ముక్కల వెంకటేశ్, వల్లెపు వెంకటేశ్, భూపతి, యాదయ్య, శ్రీకాంత్, కంది మల్లేశ్ సురేష్, శేఖర్ పాల్గొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తిచేయండి

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

పంజగుట్ట: ఖైరతాబాద్ నియోజకవర్గంలో పెండింగ్ పనులు లేకుండా అన్ని పనులు త్వరగతిన పూర్తిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సంబంధిత అధికారులకు సూచించారు. బుధవారం ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన చేశారు. బీస్తీ వాడ ప్లే గ్రౌండ్‌లో కమ్యునిటీ హాల్ నిర్మించాలని ఆదేశించారు. ఎసీ గార్డ్స్, వీర్‌నగర్‌లలో వర్షపు నీరు ఆగుతుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు. చింతల్‌బస్తీలో కమ్యునిటీ హాల్ పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలని, సీసీ రోడ్డు పనులు త్వరగా ప్రారంభిస్తామని స్థానికులకు తెలిపారు. తుమ్మలబస్తీ కమ్యునిటీహాల్ త్వరలో ప్రారంభిస్తామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కాలేజీ లైన్‌లో సీసీ కెమరాలు ఏర్పాటు చేయాలని సమైక్య భారతి అసోసియేషన్ వారు కోరడంతో వెంటనే తన నిధులతో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి అప్పటికప్పుడే పోలీస్ కమిషనర్‌తో ఫోన్ మాటాడారు. తుమ్మలబస్తీలో నిత్యం పొల్యూషన్ వాటర్ వస్తుందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో వెంటనే కొత్త పైప్‌లైన్ వేయించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజీ, వాటర్ కొత్త లైన్‌లు వేయగానే సీసీ రోడ్డు వేయించాలన్నారు. బల్కాపూర్ నాలాలో వ్యర్థలు తొలగించాలని సూచించారు. గాంధీతాతా నగర్‌లో మంచినీటి, మురుగు నీటి సమస్య పరిష్కరించాలని కోరారు. అనంతరం పంజగుట్ట మోడల్ హౌస్ వద్ద రూ. 85 లక్షలతో వేయనున్న డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఖైరతాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అరూణ్ కుమార్, డిప్యూటీ మున్సిపల్ కమీషనర్ రజనీకాంత్ రెడ్డి, అధికారులు జాన్ షరీఫ్, శ్రీనివాస్, స్వామి, బీఆర్ఎస్ నేత కె.నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

యౌవనస్థుల కూటములు ప్రారంభం

చిక్కడపల్లి: గోల్కొండ చౌరస్తాలోని ప్రముఖ హెబ్రోన్ చర్చిలో 57వ అఖిల భారత యౌవనస్థుల కూటములు ఘనంగా ప్రారంభమయ్యాయి. బుధవారం పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొన్నారు. హెబ్రోన్ సొసైటి చైర్మన్ జోసెఫ్ పి.కురియన్ పర్యవేక్షణలో పలువురు దేవసేవకులు బైబిల్ పఠనములు, సాక్ష్యములు, క్రియాపూర్వక ఉపదేశాలిచ్చారు. కూటములు ప్రశాంత వాతావరణంలో జరగడానికి సహకారం అందిస్తున్న ప్రభుత్వం, ఎమ్మెల్యే ముఠాగోపాల్, స్థానిక కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్, చిక్కడపల్లి, ముషీరాబాద్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీకి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ఎఫ్‌క్యూఐతో నాణ్యమైన ల్యాబ్ సేవలు



ల్యాబ్‌ను ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

రాంగోపాల్‌పేట్: తెలంగాణలో నాణ్యమైన ల్యాబ్ సేవలను అందించడానికి ఎఫ్‌క్యూఐ తెలంగాణ విభాగాన్ని బుధవారం సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ప్రారంభించారు. మెడికల్ ల్యాబ్‌లను అత్యున్నత నాణ్యతా ప్రమాణాలను పాటించేలా వాటిని తీర్చిదిద్దే క్రమంలో సంస్థ కిమ్స్ ఆస్పత్రిలో ఫౌండేషన్ ఫర్ క్వాలిటీ-ఎఫ్‌క్యూఐ తెలంగాణ విభాగం ఐఎస్ఐతో పాటు సికింద్రాబాద్ కిమ్స్ ఆస్పత్రిలో ఆన్‌సైట్ శిక్షణా కేంద్రాన్ని సీఈవో డాక్టర్ వెంకటేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కిమ్స్ ఆస్పత్రికి చెందిన మోయినుద్దీన్, ఇషాక్‌లకు ఎఫ్‌క్యూఐ తెలంగాణ విభాగం డైరెక్టర్, ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అప్పగించారు. 2013లో ప్రారంభమైన ఎఫ్‌క్యూఐ లాభాపేక్షలేని ఓ స్వచ్ఛంద సంస్థ ఇప్పటి వరకు 25 వేల మందికి పైగా ల్యాబ్ ప్రొఫెషనల్స్‌కు అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ల్యాబ్‌లలో క్వాలిటీ మేనేజ్‌మెంట్‌లో శిక్షణ అందించినట్లు డాక్టర్ వెంకటేష్ తెలిపారు. ఎఫ్‌క్యూఐ సేవలు భారతదేశంతో పాటు నేపాల్, యూఏఈ, బంగ్లాదేశ్, మాల్దీవ్ తదితర దేశాల్లో కూడా విస్తరించినట్లు వెల్లడించారు.

'గాంధీ'లో స్కిజోఫ్రినియాపై అవగాహన



స్కిజోఫ్రినియాపై విద్యార్థుల నాటక ప్రదర్శన

బన్సీలాల్‌పేట్: ప్రపంచ స్కిజోఫ్రినియా(మనో వైకల్యం) దినోత్సవాన్ని బుధవారం సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించారు. మానసిక వైద్య విభాగం ఆధ్వర్యంలో ఓపీ బ్లాక్ హాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీజీ, ఇంటర్న్ డాక్టర్లు 'వీధి నాటకం' ప్రదర్శించి స్కిజోఫ్రినియా లక్షణాలు, మంత్రగాళ్లు చేసే మోసాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లభిస్తున్న వైద్య సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు మాట్లాడుతూ.. స్కిజోఫ్రినియా అనేది ఒక మానసిక వ్యాధి అని, దాని లక్షణాలు తెలుసుకొని వెంటనే ప్రభుత్వ దవాఖానాలోని మానసిక వైద్యులను సంప్రదించాలని కోరారు. మంత్రగాళ్లు, చేతబడి చేసే మోసగాళ్ల వద్దకు వెళ్లకూడదని, ప్రజలు మూఢనమ్మకాలను వదిలి వైద్య సేవలను పొంది ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఆస్పత్రి మానసిక విభాగాధిపతి డాక్టర్ ఎం. ఉమాశంకర్ మాట్లాడుతూ.. స్కిజోఫ్రినియా సమస్య ఉన్నవాళ్లకు కుటుంబం, స్నేహితులు, సమాజం నుంచి తగిన ప్రోత్సాహం, ఆదరణ అందించి చేయూతనివ్వాలని కోరారు. స్కిజోఫ్రినియా రోగులకు గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా వైద్య పరీక్షలు, చికిత్స, మందులను అందజేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో కంటి విభాగాధిపతి డాక్టర్ రవిశేఖర్ రావు, ఆర్ఎంవోలు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నజీమ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఇందిర, మానసిక విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అజయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ డి. సురేష్, డాక్టర్ అనుపమ, పీజీ, ఇంటర్న్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

15 శాతం మంది సంతాన లేమితో బాధపడుతున్నారు



మహిళలకు సన్మానం చేస్తున్న దృశ్యం

రాంగోపాల్‌పేట్: దేశంలో 15 శాతం మంది మహిళలు సంతాన లేమితో బాధపడుతున్నారని ఒయాసిస్ ఫర్టిలిటీ సెంటర్ క్లినికల్ హెడ్, ఫర్టిలిటీ హెడ్ డాక్టర్ ఫరినాజ్ పర్‌హార్ అన్నారు. సికింద్రాబాద్‌లోని సెంటర్‌లో ఐవీఎఫ్‌తో గర్భం దాల్చిన మహిళలను సామూహిక సీమంతం ద్వారా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కుటుంబంలో సంతానం కలగకపోవడం నేటికి ఒక కళంకంగా భావిస్తున్నారని సరైన సమయంలో సరైన వైద్యంతో జంటలు సంతానం పొందే అవకాశం ఉంటుందన్నారు. కేవలం మూడు శాతం మంది జంటలు మాత్రం సరైన చికిత్స పొందిన సంతానం పొందుతున్నారని ఆయన అన్నారు. అస్థిర జీవన శైలి, ఊబకాయం, వైద్యపరమైన కారణాలు, పర్యావరణ కారకాలు దేశంలో సంతాన లేమి సమస్యకు కారణం అవుతున్నాయన్నారు. వయసుతో పాటు సంతాన సామర్థ్యం తగ్గుతూ వస్తుందని సంతానం కోరుకునే జంటలు ఆలస్యం చేయకుండా సంతాన సాఫల్య చికిత్సను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ మేనేజర్ సాయి చందు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య



నర్సింహ (ఫైల్)

సికింద్రాబాద్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం .. మేడ్చల్ ప్రాంతానికి చెందిన ధాత్రిక నర్సింహ (54) ప్రైవేట్ ఉద్యోగి. తాగుడుకు బానిసై భార్యను వేధింపులకు గురి చేస్తుండటంతో మూడేళ్ల పుట్టింటికి వెళ్లిపోయింది. జీవితంపై విరక్తి కలిగి ఈ నెల 23న మేడ్చల్–మనోహరాబాద్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు స్థలానికి చేరుకుని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

సికింద్రాబాద్: గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో జీఆర్పీ పోలీసుల వివరాల ప్రకారం...ఈ నెల 23 రాత్రి బొల్లారం బజార్ రైల్వే స్టేషన్ వద్ద రైలు పట్టాలపై 35 సంవత్సరాల వయస్సున్న ఓ వ్యక్తి పడి ఉండటాన్ని గమనించిన లోకో పైలెట్ రైల్వే పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ చేయగా గుర్తు తెలియని రైలు ఢీకొని చనిపోయినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు బ్లూ కలర్ జీన్స్, నలుపు, యాష్, బ్లూ కలర్లతో కూడిన ఫుల్‌హాండ్స్ టీ షర్టు ధరించాడని తెలిసిన వారు ఉంటే రైల్వే పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలి.

ఆలయ అభివృద్ధికి పాటుపడాలి



ప్రమాణ స్వీకారోత్సవంలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: భక్తులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా ఏర్పాట్లు చేయడంతో పాటు ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ నూతన పాలకమండలి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా కమిటీ సభ్యులతో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఆండాలు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సంతోష్ యాదవ్ ఆధ్వర్యంలో గత రెండు పర్యాయాలు ఆలయం ఎంతగానో అభివృద్ధి చెందడంతో ఆయనకే మరోసారి చైర్మన్‌గా అవకాశం కల్పించామన్నారు. పాలకమండలి సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు సమన్వయంతో ఆలయ అభివృద్ధికి పాటు పడాలన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ఆలయం ఎంతో అభివృద్ధి చెందిందని ఒకప్పుడు తమిళ ప్రజలు మాత్రమే అధికంగా సందర్శించే మారేడుపల్లి సుబ్రహ్మణ్య స్వామి దేవాలయాన్ని ప్రస్తుతం పెద్ద సంఖ్యలో స్థానిక భక్తులు దర్శించుకుంటున్నారని తెలిపారు. పురాతన కాలం నాటి డ్రైనేజీ వ్యవస్థలో లోపాల కారణంగా ఆలయం ముందున్న రోడ్డుపై నిత్యం మురుగు ప్రవహించేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే సాయన్న చొరవ మేరకు తాను ప్రత్యేక నిధులు మంజూరు చేయించి నూతన డ్రైనేజీ లైను వేయించానన్నారు.పాలక మండలి సభ్యులు అనవసర వివాదాలకు తావించేలా ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ గజ్జెల నాగేశ్ ఆలయాన్ని దర్శించుకుని నూతన పాలక మండలి సభ్యులకు శుభాకాంక్షలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయశాఖ అధికారులు శేఖర్ ఆండాలు, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత, నూతన చైర్మన్ సంతోష్ యాదవ్, వేణుగోపాల చారి, నర్సింగ్ రావు, పద్మజ, రమేష్ పాల్గొన్నారు.